
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

సోమవారం 31 మార్చి 2025

వెల్లివిరిసిన
భక్తి పారవశ్యం

● పలు గ్రామాల్లో ఆలయాల వార్షికోత్సవాలు.. జాతరలు ● ఘనంగా బండ్ల ఊరేగింపు

7



ఉగాది వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లడ్డూలు అందుకుంటున్న భక్తులు



సంగారెడ్డి రాంమందిర్ పైనుంచి ప్యాలాల లడ్డూలు ఎగరేస్తున్న జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి

ప్యాలాల లడ్డూలు ఎగరేసిన జగ్గారెడ్డి, జయారెడ్డి

● సంగారెడ్డి రాంమందిర్ వద్ద ఘనంగా ఉగాది

సంగారెడ్డి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం సందర్భంగా సంగారెడ్డి రాంమందిర్ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ముందుగా జగ్గారెడ్డి స్వయంగా డోలక్ వాయిస్తూ భజన గీతాలు పాడారు. అనంతరం కూతురు జయారెడ్డితో కలిసి రాంమందిర్‌పై నుంచి ప్యాలాల లడ్డూ ప్రసాదాలను ఎగరేశారు. వీటిని అందుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. దశాబ్దాల కాలంగా ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పెద్దసంఖ్యలో మహిళలు, పిల్లలు, ప్రజలు తరలి వచ్చారు. బెల్లం కలిపిన ఈ లడ్డూ ప్రసాదం తినడం వల్ల ఏడాదంతా తీపి వలే ప్రజల జీవితాలు ఉంటాయని చెప్పడమే దీని ఉద్దేశం అని జగ్గారెడ్డి అన్నారు.



ఈద్ ముబారక్

● నేడే ఈద్ ఉల్ ఫితర్ ● ఈద్గాలు, మసీదులు ముస్తాబు



సిద్దిపేటకల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల పాటు చేసిన ముస్లింల ఉపవాస దీక్షలు ముగిశాయి. షవ్వాల్ మాసం నెలవంక కనిపించడంతో నేడు రంజాన్ చేసుకునేందుకు ముస్లింలు సిద్ధమవుతున్నారు. ఈద్ ఉల్ ఫితర్ కోసం సిద్దిపేటలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గా మైదాన్‌ను సిద్ధం చేశారు. పట్టణంలోని సుఫియా మసీదు, హజ్రా మసీదు, నసీరియా మసీదును విద్యుత్ దీపకాంతులతో లైటింగ్ ఏర్పాటు చేశారు.





ఉగాది వేడుకల్లో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

శుభాలు నిండుగా..

● జిల్లాలో ఘనంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు

హుస్నాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లావ్యాప్తంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మార్కెట్లు సందడిగా మారాయి. ఇక హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ ఆయన సతీమణి మంజుల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం, పచ్చడి పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తదితరులున్నారు. కార్యక్రమానికి ముందు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేశారు. అనారోగ్యాలకు కారణమవుతున్న ప్లాస్టిక్‌ను మన జీవితాల నుంచి దూరం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని హోటల్ యజమానులకు స్టీల్ చాయ్ గ్లాసులను పంపిణీ చేసి మాట్లాడారు.

సంస్కృతీ సంప్రదాయాలను

కాపాడుకోవాలి

● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటకల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తుంటే మనం మాత్రం మరిచిపోతున్నామని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని సిద్దిపేటలోని బ్రాహ్మణ పరిషత్‌లో ఏర్పాటు చేసిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణంలో ఆయన పాల్గొన్నారు. పంచాగశ్రవణం పూర్తయిన తర్వాత హరీశ్‌రావు మాట్లాడారు. విశ్వావసు నామ సంవత్సరం అందరికీ శుభం కలగాలని ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని అన్నారు. త్వరలో సిద్దిపేటలో గేయ రామాయణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ బ్రాహ్మణ బంధువని కొనియాడారు. దేశంలో మొట్టమొదటిసారి బ్రాహ్మణ పరిషత్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేశారన్నారు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని, ఈసారి అధికారంలోకి వచ్చుంటే కొండగట్టు అంజనేయస్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేసేవారని చెప్పారు. రానున్న రోజుల్లో సిద్దిపేటలో టీటీడీ ఆధ్వర్యంలో మరో వేంకటేశ్వర స్వామి ఆలయం శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. అంతకుముందు ఉగాది కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మాజీ సీఎం కేసీఆర్ గురువు మృత్యుంజయ శర్మ, పలువురు మాట్లాడారు.

మంచు కొండల్లో సిద్దిపేట అన్నప్రసాదం

సిద్దిపేట కల్చరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లోకన్నా గొప్పదానం అన్నదానమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కేదరినాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో యాత్రలో ఉండే భక్తులకు మే 2 నుంచి ప్రారంభంకానున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. సిద్దిపేటలోని పాత గంజి (కూరగాయల మార్కెట్) వద్దనున్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయ సప్తమ వార్షికోత్సవం, శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావుకి ఆలయ నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీరామ నవమికి రావాల్సిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవాల కరపత్రాన్ని హరీశ్ రావు ఆవిష్కరించారు

కస్తూర్బా ఎదుట.. కన్నవారికి

తప్పని ఎదురుచూపు

శివ్వంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ నాడు తమ పిల్లలకు పచ్చడి, భక్షాలను ఇవ్వడానికి వచ్చిన తల్లిదండ్రులను కస్తూర్బా పాఠశాలలోనికి అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేసిన సంఘటన గూడూరు కస్తూర్బా పాఠశాల వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. 20 తండాలకు చెందిన 100 మంది వరకు తల్లిదండ్రులు తమ పిల్లల కోసం గేటు వద్ద ఎండలో మూడు గంటల పాటు నిరీక్షించారు. ఉగాది రోజున అనుమతిస్తామని మూడు రోజుల క్రితం తెలపడంతోనే ఎంతో దూరం నుంచి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మంజులను సంప్రదించగా విద్యార్థులకు చివరి పరీక్ష ఉన్నందున లోనికి అనుమతించవద్దు అని అధికారులు ఆదేశించారని తెలిపారు. లోనికి వెళ్లకుండా గేటు పైనుంచి తీసుకుని ఇవ్వమని సిబ్బందికి చెప్పామని తెలిపారు.

లక్ష్యం పూర్తయ్యేనా..?

● ఆస్తి పన్ను చెల్లింపునకు మిగిలింది ఒక్కరోజే

● 90 శాతం వడ్డీ రాయితీకి నేడే ఆఖరు

● టార్గెట్ పూర్తిచేసేందుకు

మున్సిపల్ అధికారుల కసరత్తు



సిద్దిపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌కు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ఆస్తిపన్నును వసూలు చేసేందుకు రెండు నెలల నుంచి అధికారులు, సిబ్బంది అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు తర్జన భర్జన పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ ఐదు మున్సిపాలిటీలున్నాయి. 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగానూ ప్రభుత్వం ఆస్తి పన్నును వంద శాతం వసూ లు చేసేందుకు ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీని కల్పించింది. జిల్లావ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలకు గానూ ఆస్తిపన్నుపై పెట్టుకున్న డిమాండ్ రూ.28.44 కోట్లు కాగా, శనివారం నాటికి వసూ లు రూ.22.63 కోట్లు వసూలు చేసిం ది. మిగిలిన బ్యాలెన్స్ రూ. 5.81 కోట్లను ఆది, సోమవారాలు సెలవు దినాలు అయినప్పటికి మార్చి 31 వరకే తుది గడువు కావడంతో పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేసేందుకు సెలవులను సైతం ప్రభుత్వం రద్దు చేసింది. సమయం తక్కువ గా ఉన్నందున అనుకున్న లక్ష్యాన్ని చేరువయ్యేందుకు ఆస్తి పన్ను వసూలు చేసి రాష్ట్రస్థాయిలో టాప్‌టెన్‌లో నిలిచేందుకు ఆయా మున్సిపాలిటీలు ఉవ్విళ్లూరుతున్నాయి.

ఐదు మున్సిపాలిటీల్లో

జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల ఐదు మున్సిపాలిటీలున్నాయి. సిద్దిపేటలో 36,136, గజ్వేల్ 12,419, హుస్నాబాద్‌లో 7,286, దుబ్బాకలో 6,209, చేర్యాలలో 5162 మొత్తంగా 67,212 గృహాలున్నాయి.

మున్సిపల్	ఆస్తిపన్ను	వసూలు	పెండింగ్
సిద్దిపేట	రూ.16.81 కోట్లు	రూ.14.00 కోట్లు	రూ.2.81 కోట్లు
గజ్వేల్	రూ.4.81 కోట్లు	రూ.3.92 కోట్లు	రూ.89 లక్షలు
హుస్నాబాద్	రూ.1.73 కోట్లు	రూ.1.28 కోట్లు	రూ.45 లక్షలు
దుబ్బాక	రూ.2.03 కోట్లు	రూ.1.48 కోట్లు	రూ.55 లక్షలు
చేర్యాల	రూ.3.06 కోట్లు	రూ.1.95 కోట్లు	రూ. 1.11 కోట్లు

మిగిలింది ఒక్కరోజే

ఎన్నో ఏళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించని వారికి ఉపశమనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీని కల్పించింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను మార్చి 31 వరకు గడవును విధించగా, సోమవారంతో ముగియనున్నది. ఆస్తిపన్ను చెల్లించని భవన యాజమానుల వద్దకు వెళ్లి పన్ను చెల్లించేలా అధికారులు అవగాహన కల్పించనున్నారు. ఈ ఒక్కరోజు ఆస్తిపన్ను చెల్లించకుంటే 90శాతం రాయితీ కోల్పోతారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

టాప్ టెన్‌లో నిలుస్తారా?

సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోని కనీసం టాప్‌టెన్‌లోనైనా నిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆస్తిపన్నులో గతేడాది సిద్దిపేట మున్సిపల్ రూ.11.60 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకొని రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ సిద్దిపేట మున్సిపల్ రూ.4కోట్లకు పైగా డిమాండ్‌ను పెంచుకున్నది. దీంతో రాష్ట్రస్థాయి పన్ను వసూళ్లలో సిద్దిపేట మున్సిపల్ 83.28శాతం వసూలు చేసి 19వ స్థానంలో, గజ్వేల్ మున్సిపల్ 81.50 శాతం వసూలు చేసి 25వ స్థానంలో, హుస్నాబాద్ మున్సిపల్ 73.99 శాతం వసూలు చేసి 47వ స్థానంలో, దుబ్బాక మున్సిపల్ 72.91 శాతం వసూలు చేసి 53వ స్థానంలో, చేర్యాల మున్సిపల్ 63.73 శాతం వసూలు చేసి 86వ స్థానంలో నిలిచాయి.

మొండి బకాయిలను వసూలు చేస్తున్నాం



సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని భవనాల సంఖ్య పెరగడంతో ఆస్తి పన్ను డిమాండ్‌ను పెంచాం. కొన్నేళ్లగా మొండి బకాయిలు చెల్లించని వారి వద్ద నుంచి ఆస్తిపన్నును వసూలు చేస్తున్నాం. సిద్దిపేటలో ఆస్తి పన్నుపై ప్రభుత్వం కల్పించిన 90 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధి సహకరించాలి.

- ఆశ్రిత్‌కుమార్,
మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

గ్రూప్-1లో
యువకుల సత్తా
7

161 జాతీయ రహదారిపై

టోల్ బాదుడు

పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి టోల్ చార్జీలను స్వల్పంగా పెంచారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కేంద్ర ఉపరితల రవాణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భారత్‌మాల పరియోజన పథకం కింద మూడేళ్ల క్రితం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించగా, చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామశివారులో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ఫీజు వసూలు చేస్తున్నారు. సవరించిన ధరల పట్టికను టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేశారు. నెలవారి లోకల్ పాస్‌ను సైతం రూ.10 పెంచగా, ప్రస్తుతం రూ.350 అయింది. ఏప్రిల్ 1 నుంచి ఈ టోల్ ఫీజులు అమలులోకి రానున్నాయి.



తాడ్దానిపల్లి శివారులోని టోల్‌ప్లాజా వద్ద సవరించిన టోల్ చార్జీల పట్టిక

మారనున్న హుస్నాబాద్ రూపురేఖలు

● హుస్నాబాద్ అభివృద్ధి పనులకు మరో రూ.10 కోట్లు మంజూరు

● నలుదిక్కులా స్వాగత తోరణాలు..

● కొత్త చెరువుతో పాటు జంక్షన్ల సుందరీకరణ

హుస్నాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మొన్న ఎల్లమ్మ చెరువు సుందరీకరణ...జంక్షన్ల అభివృద్ధి.. ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ.. నిన్న ఇంజనీరింగ్ కళాశాల... నేడు పట్టణ అభివృద్ధి పనులకు మరో రూ.10కోట్లు మంజూరు. ఇలా అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా మొదలవుతుండడంతో హుస్నాబాద్ పట్టణ రూపురేఖలు క్రమంగా మారుతున్నాయి. ప్రస్తుతం రూ. 18 కోట్లతో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులతో పాటు పట్టణంలోని జంక్షన్ల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల కళాశాల మంజూరు కాగా శనివారం మున్సిపల్‌లో అభివృద్ధి పనుల కోసం మరో రూ.10కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు పట్టణ సుందరీకరణ పనులకే వినియోగిస్తుండటంతో హుస్నాబాద్ రూపురేఖలు మరింత మారనున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతుండటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సుందరీకరణ పనులు

రూ. 10 కోట్లతో సుందరీకరణ పనులు..

హుస్నాబాద్ మున్సిపల్‌లో అభివృద్ధి పనుల కోసం మంజూరైన రూ.10కోట్లతో సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నేషనల్ హైవేలోని సిద్దిపేట రోడ్డు శ్రీ చైతన్య పాఠశాల నుంచి పెట్రోల్ బంకు వరకు సెంట్రల్ లైటింగ్ ప్లాంటేషన్‌కు రూ. 1 కోటి, మల్లె చెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ డివైడర్ల నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించడంతో అక్కడ కొత్త అందాలు సంతరించుకోనున్నాయి. సిద్దిపేట వైపు నేషనల్ హైవే పక్కన ఉన్న కొత్త



హుస్నాబాద్‌లో జరుగుతున్న నేషనల్ హైవే సెంట్రల్ లైటింగ్ ప్లాంటేషన్ పనులు

చెరువు సుందరీకరణ పనులకు రూ.2కోట్లు, నలుదిక్కుల మున్సిపల్ స్వాగత తోరణాల ఏర్పాటుకు రూ. 120 కోట్లు, అదనంగా నూతన జంక్షన్ల అభివృద్ధి సుందరీకరణ పనులకు రూ. 80 లక్షలు మంజూరు చేశారు.

పండుగకు అమ్మమ్మ ఇంటికి వస్తూ
అనంతలోకాలకు..

● ఆటోను ఢీకొన్న అడవి పందుల గుంపు
● యువకుడి దుర్మరణం


భానుచందర్ మృతదేహం

రామయంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు అమ్మమ్మ ఇంటికి వస్తూ.. ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ (24) పని నిమిత్తం శనివారం ఆటోలో మేడ్చల్ ప్రాంతానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి తిరుగు ప్రయాణంలో తన అమ్మమ్మ స్వగ్రామమైన సుతార్పల్లికి వస్తున్నాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునే క్రమంలో ఒక్కసారిగా అడవి పందుల గుంపు వచ్చి ఆటోను ఢీకొనడంతో అదుపుతప్పి బోల్తా పడిపోయింది. భానుచందర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఆదివారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన ఓ అడవి పందిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ గుంతలో యువకుడి గల్లంతు!

తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్వారీ గుంతలో స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రభాకర్(35) కుటుంబీకులు ఎవరు లేకపోవడంతో ఒంటరిగా తూప్రాన్ పట్టణ పరిధిలోని కరీంగూడలో నివాసముంటూ క్వారీలో రాళ్లను ట్రాక్టర్‌లో నింపే కూలిగా చేస్తున్నాడు. శనివారం పని అనంతరం స్నానం చేసేందుకు స్థానికంగా ఉన్న ఓ క్వారీ గంత నీటిలోకి దిగి గల్లంతయ్యాడు. శనివారం రాత్రి నివాసానికి, ఆదివారం పనికి రాకపోవడంతోపాటు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో క్వారీ ఒడ్డున అతడి బట్టలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రభాకర్‌కు మూర్ఛవ్యాధి ఉందని ఈ క్రమంలో నీటిలో మునిగిపోయి ఉంటాడని భావిస్తున్నారు. కాగా, క్వారీలో గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు.

చెరువులో దూకిన వ్యక్తి..

తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భార్య గొడవ పడిన వ్యక్తి చెరువులో దూకగా గల్లంతయ్యాడు. కాలనీ వాసులు, పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ ఎస్సీ కాలనీకి చెందిన దాసరి యాదగిరి(40) ఆదివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉగాది రోజున తాగిరావడంపై భార్యతో గొడవ జరగడంతో తాను చనిపోతానంటూ యాదగిరి ఇంట్లో నుంచి బయటకెళ్లాడు. అతడు గ్రామ సమీపంలో ఉన్న మ్యాడక చెరువులో దూకినట్లు కాలనీవాసులు తెలుపడంతో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా యాదగిరి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

భార్య కాపురానికి రావడం లేదని
భర్త ఆత్మహత్య


వేణుగోపాల్ (ఫైల్)

మాసాయిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం పోతన శెట్టిపల్లి గ్రామానికి చెందిన బండారి వేణుగోపాల్(31) భార్య దీపిక రెండు నెలలుగా కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు శనివారం రాత్రి ఇంట్లో చీర కొంగుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వేణుగోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో నవ వరుడు..


ప్రవీణ్ (ఫైల్)

జోగిపేట రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో నవ వరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్ (24)కు రెండు నెలల క్రితం సదాశివపేట మండలం నిజాంపేటకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కొన్ని రోజులుగా వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకెళ్లిన ప్రవీణ్.. పొలం వద్ద ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి తండ్రి చాలకి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నారాయణఖేడ్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికైన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి భోజిరెడ్డిని ఆదివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి శాలువాలతో సన్మానించి, మిఠాయిలను తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

పస్తాపూర్‌లో మహిళ హత్య


మ్యాతరి లక్ష్మి(ఫైల్)

జహీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం పస్తాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలనీలో మ్యాతరి లక్ష్మి(45) అనే మహిళ ఆదివారం ఉదయం హత్యకు గురైంది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఝరాసంగం మండలం చీలమామిడికి చెందిన మ్యాతరి లక్ష్మి కొంతకాలంగా పట్టణంలోని పస్తాపూర్‌లో నివాసముంటూ కూలీ పనులకు వెళ్తున్నది. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి ఆమెను హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్ని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టూ కారంపొడి చల్లి ఉండడం, అక్కడే గ్యాస్ సిలిండర్ ఉండడంతో కళ్లలో కారం చల్లి, కొట్టి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. జాగీలాలతో తనిఖీలు నిర్వహించినా ఆనవాళ్లు లభించలేదు. మృతురాలి చెల్లెలు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి పట్టణ సీఐ శివలింగం చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

● మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ నేపథ్యంలో ఘటన


షాబొద్దీన్ మృతదేహం

గజ్వేల్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొడుకు చేతిలో తండ్రి హత్యకు గురైన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పటేల్ బజారుకు చెందిన ఎండి షాబొద్దీన్(54)కు భార్య రజియాబేగం, కొడుకు షాకేర్, కూతురు ఉన్నారు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న షాబొద్దీన్‌కు అతని కొడుకు షాకేర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వంటింట్లోకి వెళ్లిన షాబొద్దీన్ కాలుజారి కింద పడడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే రజియాబేగం షాబొద్దీన్‌ను పక్కకు తీసుకువెళ్లింది. అర్ధరాత్రి సమయంలో షాబొద్దీన్ నిద్రిస్తుండగా షాకేర్ అతని మెడకు తాడును బిగించి చంపేందుకు ప్రయత్నించాడు. గమనించిన రజియాబేగం అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. షాబొద్దీన్ పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● దుబ్బగట్టు జాతర

టేక్మాల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దన్నూర గ్రామ శివారులోని దుబ్బగట్టు జాతర షురూ అయ్యింది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం గుమటాల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. పల్వంచ, బర్డిపూర్, మల్కాపూర్, కుసంగి దాదాయిపల్లి గ్రామాల నుంచి బండ్లు ఊరేగింపుగా తరలివచ్చాయి.



● మత్తడి పోచమ్మ జాతర షురూ...



నారాయణఖేడ్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో ఆదివారం మత్తడి పోచమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ బాధ్యులు భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ తాజామాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు



పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లోని పురాతనమైన అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 వరకు జరిగే ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ధ్వజ రోహణం, అభిషేకం, బండ్ల తిరుగుట, స్వామి వారి రథోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తీర్థాల రామకృష్ణ ఆలయ మంటపంలో పంచాంగ పఠనం వినిపించారు. ఆలయంలోని మహా శివలింగానికి గ్రామానికి చెందిన కటకం సుధాకర్‌గౌడ్-సుధారాణి దంపతులు బంగారంతో తయారు చేయించిన మూడో కన్నును బహూకరించారు.



పెద్దశంకరంపేటలో బండ్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

వెల్లివిరిసిన భక్తి పారవశ్యం

● పలు గ్రామాల్లో ఆలయాల వార్షికోత్సవాలు.. జాతరలు ● ఘనంగా బండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని దుర్గమ్మ ఆలయం చుట్టూ ఆదివారం సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు కనులపండగగా జరిగింది. ముందుగా పేటలోని పలు పురవీధుల గుండా భాజాభజంత్రీలు, యువకులు నృత్యాలు మధ్య బండ్ల ఊరేగింపు నిర్వహిస్తూ ఆలయానికి చేరుకున్నారు. దుర్గమ్మ ఆలయం అనంతరం కొండల రాయిని గుడి, పోచమ్మ ఆలయ చుట్టూ బండ్లను ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పొట్టేలు ఫలహారం బండ్లు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

● బెజ్జంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ పలు గ్రామాల రైతులు ఎడ్లబండ్లను తిప్పారు.

● చిలప్‌చెడ్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని అజ్జమర్రి, ఫైజాబాద్, చిలప్‌చెడ్ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్లను ఊరేగించారు.



చిలప్‌చెడ్ : ఎడ్ల బండ్ల ఊరేగింపు..



●నేత్రపర్వం శతఘటాభిషేకం



శతఘటాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితుల

వర్గల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు శతఘటాభిషేకంతో ఆదివారం ముగిశాయి. ఆలయ మండపంలో స్వామివారికి శతఘటాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం పురస్కరించుకుని విశేష పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ పర్యవేక్షణల ముగింపు వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, జగన్నాథ చార్యులు, నాగరాజు శర్మ, హరిప్రసాద్ శర్మ, గోపాలకృష్ణ శర్మతో పాటు ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండు పాల్గొన్నారు.

● రమణీయం.. రథోత్సవం

శివ్వంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో భర్మస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ స్వామివారిని నిజామాబాద్, భైంసా, దేవరకొండ, శంషాబాద్, మహారాష్ట్ర గిరిజనులు ఇలవేల్పుగా కొలుస్తూ పెద్ద సంఖ్యలో హాజరై మూడు రోజులపాటు ఇక్కడే బస చేసి రథోత్సవంలో పాల్గొనడం విశేషం. ఆలయ చైర్మన్ పిల్లి శివ శంకర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. పలువురు ప్రముఖులు ఉత్సవాలకు హాజరయ్యారు.



‘విశ్వావసు’లో మరింత ప్రగతి

● కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆదాయం-11, వ్యయం-11
● వీరశైవాగమ పండితుడు ఆనందయ్య



పంచాంగ పఠనం చేస్తున్న వీరశైవాగమ పండితుడు ఆనందయ్య

చేర్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : భక్తుల పాలిట కొంగుబంగారంగా విలసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం విశ్వావసు నామ సంవత్సరంలో మరింత అభివృద్ధి చెందుతుందని వీరశైవాగమ పండితుడు ఆనందయ్య జోస్యం చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కొమురవెల్లి మల్లన్న ఆలయ ముఖమండపంలో పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లన్నకు ప్రత్యేకపూజలు జరిపిన అనంతరం రాశుల వారీగా ఫలితాలు వివరించారు. కొమురవెల్లి మల్లన్నది సింహరాశి అని, మల్లన్నకు ఆదాయం- 11, వ్యయం-11ఉన్నందున మౌలికవసతుల కల్పనలో సమాంతర అభివృద్ధితో మరింత ఉన్నతబాటలో పయనిస్తుందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. విద్యవైద్యం, భవన నిర్మాణరంగాల వారికి శుభసూచకంగా ఉంటుందని, పశుసంపద పెరుగుతుందన్నారు. గతసంవత్సరంలో అనుభవించిన బాధలన్నీ ప్రస్తుత విశ్వావసులో తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకసంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఒగ్గు పూజారులసంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానార్చకుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మల్లన్న ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్

కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉగాది పురస్కారం వరించింది. ఆదివారం దేవాదాయశాఖ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌లు ఆయనను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రం, నగదు పురస్కారానికి అందజేశారు. మల్లికార్జున్‌ను ఆలయ అధికారులు, అర్చకులు, ఉద్యోగులు అభినందించారు.

ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి



ఎడకే మృతదేహం

దౌల్తాబాద్,మార్చి (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతిచెందాడు. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. నందేడ్ జిల్లా మాచునూర్ గ్రామానికి చెందిన ఐర్వా ఎడకే(45) తన భార్య పిల్లలతో కలిసి రెండు నెలల క్రితం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి వచ్చి చింతకింది నాగరాజుకు చెందిన ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఆదివారం ఇందుప్రియల్‌లోని రామాయంపేట కెనాల్‌లో ఈత కోసం వెళ్లిన ఎడకే ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ సిబ్బందితో అక్కడికి చెరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చందర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన భర్త మృతితో తమ కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య కోరింది.

కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలి

● నీలం మధు ముదిరాజ్

ముదిరాజ్ పటాన్‌చెరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలుగు నామ సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తన స్వగ్రామం చిట్కుల్‌లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు



పల్లకి సేవలో పాల్గొన్న నీలం మధు



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తులరద్దీ

మల్లన్న ఆలయం.. భక్తజన సందోహం

చేర్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులుకట్టారు. ఆలయ ఈవో రామాంజనేయు లు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మల్లన్న భక్తుల సెల్‌ఫోన్లు అపహరించిన మహిళ

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన పలువురు భక్తుల సెల్‌ఫోన్లు అపహరించిన ఓ మహిళను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం మల్లన్నను దర్శించుకున్న భక్తులు గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పట్నాలు రచించి చెట్టుచుట్టూ ప్రదక్షిణలు చేయడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. పాదాల మండపంలో పలువురు తమ సామగ్రితో బసచేయగా, సందట్లో సడేమియా అన్న చందంగా చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ సెల్‌ఫోన్ అపహరిస్తూ పట్టుబడింది. భక్తులు దేహశుద్ధి చేసి ఆమె వద్ద తనిఖీ చేయగా రెండు సెల్‌ఫోన్లు లభ్యమయ్యాయి. దీంతో ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఆమెను మందలించి వివరాలు నమోదు చేసుకుని పోలీసులకు అప్పగించారు.

నేటి నుంచి రేణుకాంబ ఆలయ వార్షికోత్సవాలు

సంగారెడ్డి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం హౌసింగ్‌బోర్డుకాలనీలో గల రేణుకాంబ(ఎల్లమ్మ) ఆలయ వార్షికోత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగే వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 31న గణపతి పూజ, పుణ్యావాచన, మాతృక, యోగినీ, వాస్తు, నవగ్రహ, మండల దేవతాస్థాపనం, ఏప్రిల్ ఒకటిన అమ్మవారికి మహాభిషేకం, ఆవాహిత దేవతా హోమం, రుద్ర చండీయాగం, పూర్ణాహుతి, 2న గంగ పూజ, అమ్మవారి కల్యాణం, 3న బోనాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





ఉప్పరపల్లి సమ్మక్క సారలమ్మ జాతరకు వేళాయే

● నేడు అమ్మవార్లను గద్దె ఎక్కించుట, కల్యాణం

దౌల్తాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి గ్రామం ఉప్పర చెరువు ఉడల మర్రి చెట్టు కింద వెలిసిన సమ్మక్క సారలమ్మ జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు జరుగనుంది. ఆలయం వద్ద ప్రతీ రోజు రాత్రి 8 గంటలకు కుక్కల ఐలయ్యచే అమ్మవార్ల జీవిత చరిత్రను తెలియజేయనున్నారు. సోమవారం ఉదయం దేవతలను గద్దెను ఎక్కించనుండగా, మధ్యాహ్నం బోనాల ఊరేగింపు, సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఎడ్ల బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

గ్రూప్-1లో యువకుల సత్తా

● ప్రణయ్‌సాయికి 17వ ర్యాంకు..



తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌పట్టణానికి చెందిన బోయినిపల్లి ప్రణయ్‌సాయి గ్రూపు-1 ఫలితాల్లో 513 మార్కులతో రాష్ట్రస్థాయి 17వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయినపల్లి విష్ణువర్ధన్, శ్రీవిద్య దంపతుల కుమారుడైన ప్రణయ్‌సాయి ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. గ్రూపు-4 ఫలితాల్లోనూ సత్తా చాటి చేగుంట రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూపు-2లో 134వ ర్యాంకు, గ్రూపు-3లో 148వ ర్యాంకు సాధించగా, ప్రస్తుతం గ్రూపు-1 ఫలితాల్లో 17వ ర్యాంకు సాధించాడు.

● శభాష్ శైలేష్..



మెదక్ అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో మెదక్ పట్టణానికి చెందిన పూన శైలేష్ సత్తా చాటాడు. 503.500 మార్కులతో శైలేష్ రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు సాధించాడు. పూన రవి, ఝాన్సీ దంపతుల పెద్ద కుమారుడైన శైలేష్ పదో తరగతి అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్, ఇంటర్ నారాయణ కళాశాల, డిగ్రీ ఢిల్లీ యూనివర్సిటీలో చదివాడు. ఎంఏ చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఎవరి దగ్గర శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనత సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పట్టుదలతో శ్రమించాడు. రోజుకు 10-12 గంటలు చదివినట్లు తెలిపారు. గ్రూప్స్ రాయాలనుకునేవారు మొదట పరీక్షకు విశ్లేషించుకోవాలని, తర్వాత అవగాహన ఏర్పర్చుకుని ప్రిపిరేషన్ కొనసాగిస్తే విజయం సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాంకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, డీఎస్పీ పోస్టు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

● మూసాపేట యువకుడికి 73వ ర్యాంకు



పెద్దశంకరంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండలం మూసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్‌రెడ్డి 73వ ర్యాంకు సాధించారు. మూసాపేటకు చెందిన ఎరగారి శశిధర్‌రెడ్డి, (పీఏసీఎస్ డైరక్టర్), పావని దంపతుల పెద్దకుమారుడైన అతడు రెండు నెలల క్రితం వెల్లడైన గ్రూపు-4 ఫలితాల్లోనూ సత్తా చాటి కొల్చారం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. మెదక్ సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసి, హైదరాబాద్ శ్రీనిధి ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాడు. మూడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రిపేర్ అయ్యాడు.

● ఓ వైపు ఉద్యోగం.. మరోవైపు ప్రిపరేషన్..



కొండపాక, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందారం గ్రామానికి చెందిన నర్ర భగవాన్ రెడ్డి, వజ్రమ్మల కుమారుడు నర్రా అఖిల్ రెడ్డి 75వ ర్యాంకు సాధించాడు. దుద్దెడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, సిద్దిపేటలో ఉన్నత విద్య పూర్తి చేసిన అఖిల్ రెడ్డి సిద్దిపేటలోని గురుకృప కళాశాలలో ఇంటర్, హైదరాబాద్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాడు. 2016లో మల్లన్న సాగర్ ప్రాజెక్టులో ఇరిగేషన్ ఏఈగా ఉద్యోగం సాధించాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. రెండు సార్లు మెయిన్స్ వరకు వెళ్లిన అతను.. చివరకు 75వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. తల్లిదండ్రులతోపాటు భార్య సంఘమిత్ర ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా..



హుస్నాబాద్‌రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం ఫూల్‌నాయక్ తండాకు చెందిన లావుడ్య సోమ్లా- లక్ష్మిదంపతుల పెద్ద కుమారుడు శ్రీకాంత్ 89వ ర్యాంకు సాధించాడు. 2018లో పంచాయతీ కార్యదర్శిగా, ఆ తర్వాత వీఆర్‌వో ఉద్యోగం పొందారు. అనంతరం ఎస్ఐ కాడమే లక్ష్యంగా పట్టుదలతో శ్రమించి విజయం సాధించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చందుర్తిలో ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్.. జోనల్ వ్యవస్థ మార్పులో భాగంగా ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీరావుపేట ఎస్ఐగా పనిచేస్తున్నారు. అయినా ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపనతో ఓ వైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. తాజాగా గ్రూప్-1 ఫలితాల్లో 89వ ర్యాంకు సాధించాడు.


సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు


దుబ్బాకలోని ఆర్యవైశ్యభవనంలో పంచాంగ పఠనం చేస్తున్న ప్రముఖ పురోహితుడు వేలేటి జయరామశర్మ


జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో పంచాంగ శ్రవణంలో గ్రామస్థులు


చిన్నకోడూరు మండలం సలేంద్రి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో రాశి ఫలాలను వివరిస్తున్న పండితుడు

ఘనంగా ఉగాది వేడుకలు

తెలుగు నూతన సంవత్సరాది అయిన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే గృహాలు, వ్యాపార సముదాయాలు, ఆలయాలను పచ్చని మామిడి ఆకుల తోరణాలు, వేప కొమ్మలతో అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో పిండివంటలతో పాటు పండుగ ప్రత్యేకతగా భావించే షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని నైవేద్యంగా పెట్టి ఇంటిల్లిపాది ఆరగించారు. ఆలయాల్లో ఉగాది పచ్చడిని మట్టికుండల్లో ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఆలయప్రాంగణాలు, చావిడిల్లో పురోహితులతో పంచాంగ పఠనం కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. అదేవిధంగా ఆయా పార్టీల కార్యాలయాల్లో సైతం పంచాంగ శ్రవణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురోహితులు విశ్వావసు నామ సంవత్సరంలో జరగబోయే ఫలితాలను, వ్యక్తిగత రాశి ఫలాలను చదివి వినిపించడాన్ని ప్రజలు, నాయకులు ఆసక్తిగా ఆలకించారు. పలుగ్రామాల్లో ఎడ్లబండ్లను అందంగా ముస్తాబు చేసి ఊరేగింపుగా గ్రామ శివార్లలోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి రాబోయే ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)


తొగుట మండలం చందాపూర్‌లో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఫలితాలను వివరిస్తున్న పురోహితుడు


మద్దూరు: ధర్మారంలోని అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో పంచాగ పఠనం


బెజ్జంకి: గాగిల్లాపూర్‌లో పంచాంగ శ్రవణంలో గ్రామస్థులు


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు రామాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమంలో భక్తులు


కొండపాక: మర్పడగ లో పంచాంగ పఠనం చేస్తున్న చెప్పెల హరినాథ శర్మ, హాజరైన భక్తులు


రాయపోల్‌లో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు వెంకటేశ్వరశర్మతో గ్రామస్థులు

బెజ్జంకికి వ్యవసాయ కళాశాల మంజూరు

బెజ్జంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరైనట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాలను మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలానికి మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈనెల 28న ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల సదుపాయాల నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పులికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష ఎకరాల్లో యాసంగి పంట కాళేశ్వరం పుణ్యమే


కొండెంగలకుంట పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ మంత్రి పూజలు

చిన్నకోడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గతంలో సిద్దిపేట ప్రాంతం కరువుతో కటకటలాడేదని, ప్రస్తుతం సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగిలో లక్ష ఎకరాల పంట పండుతుందంటే అది కాళేశ్వరం పుణ్యమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కమ్మర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండెంగలకుంట గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి ఆదివారం హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సుఖఃసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మించాలి


ములుగులో అస్తవ్యస్తంగా ఉన్న మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్త

ములుగు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మురికి కాలువ నిర్మించి దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. మండల కేంద్రమైన ములుగు అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో మురికి కాలువ నిర్మించకపోవడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మురికి కాలువ నిర్మించి పైనే స్లాబ్ వేసినట్లయితే కొంతవరకు సమస్య తీవ్రతను తగ్గించవచ్చని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా పాలకులు అధికారులు చర్యలు చేపట్టి మురికి కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముదిరాజుల సంక్షేమానికి కృషి చేయాలి


ములుగులో ముదిరాజ్ సంఘం జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

ములుగు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు దర్శనం సత్తయ్య అన్నారు. ఆదివారం ములుగులో ముదిరాజ్ సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా దర్శనం సత్తయ్య, నాగేశ్ మాట్లాడుతూ ముదిరాజులంతా విద్యతో పాటు రాజకీయంగా ఎదగాలని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో ముదిరాజ్ కులస్థులు ప్రతీ గ్రామంలో పోటీలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుమ్మడి యాదగిరి, హరిబాబు, వైకుంఠం, కొండు నరసింహులు, లగడబోయిన ముత్యాలు, నర్సింలు, యాదగిరి, మల్లేష్, కనకయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ విద్యార్థులకు ఏకలవ్య ఇంటర్ స్టేట్ అవార్డులు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న హుస్నాబాద్ విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఏకలవ్య స్కూల్ అన్యువల్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో హుస్నాబాద్‌కు చెందిన కేరళ హైస్కూల్ విద్యార్థులు ఇంటర్ స్టేట్ అవార్డులను అందుకున్నారు. ఈనెల 29న హైదరాబాద్‌లోని కొండాపూర్ టీసీసీ క్లబ్‌లో 2024-25 ఏకలవ్య ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్, ఐటీ స్టేట్ అవార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో హుస్నాబాద్‌లోని కేరళా హైస్కూల్‌కు చెందిన పి స్వాతి 9వ తరగతి ఏకలవ్య ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్, ఐటీ అవార్డు అందుకుంది. క్లాస్ టాపర్లుగా ఎల్ వైష్ణవి, ఆర్ శరత్‌కుమార్, వి సాయి హవిష్‌లు మహరాజ్ రామకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ ఆళ్ల శైలేందర్ అభినందించారు.

నీరందక రైతన్న గుండె చేరువాయె

● ముబ్బారస్‌పూర్‌లో పొట్టదశలో సుమారు 60 ఎకరాల వరి పంట పశువులపాలు ● పరిహారం అందించాలంటూ వేడుకోలు


ముబ్బారస్‌పూర్‌లో ఎండుతున్న వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు బోటుక తిరుపతి

దౌల్తాబాద్,మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి పంట కళ్లెదుటే ఎండుతుంటే కర్షకుల గుండె చేరువవుతోంది. రూ. లక్షలు వెచ్చించి వ్యవసాయం చేస్తే భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండి పోవడంతో పొట్టదశలో వరి పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతన్నలు బోరుమంటున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ముబ్బారస్‌పూర్ గ్రామంలో సుమారు 60 ఎకరాల్లో సాగుచేసిన వరి పొలాలు ఎండిపోవడంతో పశువులకు మేతగా మారింది. పక్కనే నర్సంపేట కెనాల్ నుంచి నీళ్లు ఇతర గ్రామాలకు పారుతున్నాయి. నర్సంపేట కెనాల్ నుంచి గత నెలలో ముబ్బారస్‌పూర్ చెరువు నింపాలని రైతులు రోడెక్కి ధర్నా చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదు. గ్రామానికి చెందిన బోటుక తిరుపతి 5 ఎకరాలు కౌలుకు తీసుకొని ఎన్నో ఆశలతో వరి సాగు చేస్తే నీళ్లు లేక పొట్ట దశలో వరి ఎండి పోవడంతో చేసేదేమి లేక ఎండిన వరి చేనులో పశువులను మేపుతున్నాడు. ఇలా ఈ ఒక్కరైతే కాదు.. బోర్లు అడుగంటిపోవడంతో చాలా మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం ఎండిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఆర్థిక సాయం అందించాలంటున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చక్రధారిశర్మకు సన్మానం


చక్రధారిశర్మను సన్మానిస్తున్న దాచారం గ్రామస్థులు

గజ్వేల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత విశిష్ట పురస్కారాన్ని అందుకున్న గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన గౌరీభట్ల చక్రధారిశర్మను దాచారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించిన అనంతరం గ్రామస్థులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి


మల్లన్నసాగర్ శివారులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి

తొగుట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల యువత దృష్టి సారించాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట శివారులో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని భవిష్యత్ గెలుపుబాటగా మలుచుకొని రాణించాలన్నారు. క్రికెట్ పోటీల్లో వెంకట్రావ్‌పేట, కొల్గూరు, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల జట్లు పాల్గొనగా వారికి ట్రై సిరీస్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, వెంకటేశ్, యాదగిరి, స్వామి గౌడ్, పోతరాజు స్వామి పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ


ఎల్లారెడ్డిపేటలో ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీటీసీ స్వామి

తొగుట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని పెద్దమాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఆదివారం పన్యాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పులస్వామి ముదిరాజ్ ఆయా గ్రామాల్లోని ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

మిరుదొడ్డి రామాలయం చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి



మిరుదొడ్డి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండల కేంద్రంలోని రామాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి ఉపాధ్యక్షుడిగా కమ్మరిస్వామి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కుంటరాజు, సంయుక్త కార్యదర్శిగా ధర్మారం మల్లయ్య, ధార మల్లయ్యలు, కోశాధికారిగా నేరేండ్ల రాజుగౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన నాయకులు


ప్రధాని మోదీ మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

దూళిమిట్ట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రజలను అనేక విషయాల్లో చైతన్యపరుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంకుగారి శశిధర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, మండల అధ్యక్షుడు యాదగిరి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి సేవాభావం అందరికీ ఆదర్శం

● ఉగాది నుంచి భవనందాపూర్ గ్రామంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ దామోదర్

మర్కుక్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవనందాపూర్ గ్రామానికి చెందిన ఉన్నత విద్యావంతుడు యువకుడు రమేష్ గ్రామస్థుల కోసం స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ముందుకు వచ్చాడు. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికి ప్రతిరోజు 20 లీటర్ల నీటిని అందించాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం ప్రత్యేకంగా ఇంటికో కార్డును పంపిణీ చేశాడు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రమేష్ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఎస్ఐ దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతకాయల లక్ష్మణ్, చింతకాయల రవి, ఉప్పరి కరుణాకర్, చింతకాయల కరుణాకర్, రమేష్, ముత్యాలు, నరికే కరుణాకర్, పోకల స్వామి, గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కారం గ్రామ శివారులోని ఓ పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుల నుంచి రూ.5,999 నగదు, 4మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఐవోసీ పేరు చెరిగినా పట్టించుకునే నాథుడేడీ?





గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ శాఖల కార్యాలయ భవనం (ఐవోసీ) పేరు చెరిగిపోయినా పట్టించుకునే నాథుడే లేదు. సంగాపూర్ రోడ్డులోని సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం ఇన్ గేట్ వద్ద ఇంగ్లిషులో ఉన్న పేరుతో పాటు తెలుగులో ఉన్న పేరులోని పలు అక్షరాలు చెరిగిపోయాయి. పేర్లు చెరిగిపోయి ఏడాది గడిచినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరిగిపోయిన అక్షరాలను సరిచేయాలని కోరుతున్నారు.

-గజ్వేల్, మార్చి30(ఆంధ్రజ్యోతి)


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

రంగోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముంబై ఆర్గనైజేషన్ రంగోత్సవ్ ఇంటర్నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గజ్వేల్ మండలం కొడకండ్ల ఆల్ఫా ఒమేగా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 42 మంది హాజరు కాగా అందులో 17మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, కరస్పాండెంట్ ప్రేమ్‌కుమార్, అభినందించారు.